సాక్షి జగిత్యాల

శుక్రవారం । 30 । జూన్ । 2023

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్పీ



జగిత్యాలక్రైం: జగిత్యాల ఎస్బీ సీఐగా పనిచేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొందిన రాజశేఖర్‌రాజు గురువారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



ఉమ్మడి జిల్లాలో మరో నగ

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మరో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది. పెద్దపల్లి జిల్లా కూనారంలో రెండో వ్యవసాయ కళాశాలకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మంచు పొగ కమ్ముకునే అవకాశం ఉంది. తేమ శాతం అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

నేడు హైలెవల్ వంతెనల నిర్మాణానికి శంకుస్థాపన



ఇబ్రహీంపట్నం, వర్షకొండ గ్రామాల మధ్య లోలెవల్ వంతెన

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): మండలంలోని లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో శుక్రవారం ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు శంకుస్థాపన చేయనున్నారు. యామపూర్ నుంచి ఫకీర్‌కొండాపూర్ వెళ్లే దారిలో హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ.4.50 కోట్లు, ఇబ్రహీంపట్నం- వర్షకొండ దారిలో 2 హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరయ్యాయి. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఇటీవల టెండర్లు పూర్తి చేశారు. హైలెవల్ వంతెనల నిర్మాణం పూర్తయితే వాహనదారులు, రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. కాగా శంకుస్థాపనల అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో కులసంఘాల భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తూ సంఘ సభ్యులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీపీ జాజాల భీమేశ్వరి పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ల్లో (ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు) 2023–24 సంవత్సరానికి గాను ఏఎన్‌ఎం పోస్ట్ కోసం అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్‌బాషా తెలిపారు. అభ్యర్థులు tsobmms. cgg. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వయస్సు 18 నుంచి 48 సంవత్సరాలుండాలని, ఎస్సెస్సీ, ఇంటర్ ఉత్తీర్ణులై, ప్రభుత్వం గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 18 నెలలు ఏఎన్‌ఎం శిక్షణలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. గిరిజన విద్యాసంస్థల్లో పనిచేసినవారికి 20 శాతం వెయిటేజీ ఇవ్వబడుతుందన్నారు. జూలై 13లోపు కేవలం మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96521 18867 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గ్రూప్–4 అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు

జగిత్యాలటౌన్/మెట్‌పల్లి: గ్రూప్–4 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు జగిత్యాల డిపో మేనేజర్ వెంకటనర్సప్ప తెలిపారు. ఏదైన గ్రామం లేదా ప్రాంతం నుంచి 40 మంది అభ్యర్థులు ఉంటే పరీక్ష సెంటర్ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని, ఈ సౌకర్యాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే మెట్‌పల్లి డిపో నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయని మేనేజర్ వేదవతి తెలిపారు. ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, వివరాలకు 90105 73250 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆమె సూచించారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి(ధర్మపురి): మెరుగైన వైద్యం కోసం నిరుపేదలు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని వినియోగించుకోవాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మండలంలోని రామబద్రునిపల్లి గ్రామానికి చెందిన శ్రీరామ మధుకర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం అవసరమగు ఆర్థికసాయం అందించాలని మంత్రికి విన్నవించాడు. స్పందించిన మంత్రి బుధవారం రాత్రి బాధితుడికి రూ.2.5 లక్షల విలువ గల ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రం అందించి నిమ్స్ ఆసుపత్రికి సిఫారస్ చేశారు. ఈసందర్భంగా మధుకర్, అతడి కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పోడు పట్టాలు అందజేయాలని వినతి

మెట్‌పల్లి(కోరుట్ల): పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న తమకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ మండలంలోని కేసీఆర్ తండా గ్రామస్తులు గురువారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. గత 30 ఏళ్లుగా 115 కుటుంబాలు పోడు భూముల్లో సాగు చేసుకుంటున్నా.. అధికారులు మాత్రం అర్హులు కాదని నిర్ధారించారని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో తాము ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతామని, పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.







ఘనంగా తొలి ఏకాదశి

- ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో భక్తుల ప్రత్యేక పూజలు

ధర్మపురి/జగిత్యాలటౌన్: జిల్లావ్యాప్తంగా గురువారం తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇళ్లలో పిండి వంటల చేసుకొని మహా విష్ణువును కొలిచి నైవేద్యాలు సమర్పించారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశి సందర్భంగా పవిత్ర గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించారు. జగిత్యాలలో సత్యసాయి మహిళా విభాగం ఆధ్వర్యంలో భగవాన్‌శ్రీసత్యాసాయిబాబా మందిరంలో రుద్రాభిషేకం నిర్వహించారు. పరమశివుడికి శోడసరన పంచామృత అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు.

ఆగుతూ.. సాగుతూ..!

- పెద్దపల్లి – ఇందూరు రైల్వేకు 30 ఏళ్లు
- 1993లో శంకుస్థాపన చేసిన నాటి ప్రధాని పీవీ
- 24 ఏళ్లకు పూర్తయిన రైల్వేలైన్
- విద్యుద్దీకరణ పూర్తయినా సింగిల్ మార్గమే
- కొత్తపల్లి– మనోహరాబాద్ పూర్తయితే మరిన్ని రైళ్లు
- భవిష్యత్ రైల్వే కేంద్రంగా కరీంనగర్





దక్షిణ మధ్య రైల్వే
శ్రీ పి.వి.నరసింహారావు గారు
శ్రీ సి.కె.జాఫర్ షరీఫ్ గారు
శ్రీ కోట్ల విజయభాస్కర రెడ్డి గారు

రెల్వేలైన్ శంకుస్థాపన శిలాఫలకం(ఫైల్)



పెద్దపల్లి-నిజామాబాద్ రైల్వేలైన్‌కు పెద్దపల్లిలో శంకుస్థాపన చేస్తున్న అప్పటి ప్రధాని పీవీ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 1993 జూన్ 30.. ఇదొక చారిత్రక విశిష్టత కలిగిన రోజు. రైలు కూత వినాలన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసుల కలకు ఆ రోజే బీజం పడింది. కరీంనగర్ ముద్దుబిడ్డ.. నాటి ప్రధాని పీవీ.నరసింహారావు పెద్దపల్లి–నిజామాబాద్ (ఇందూరు) రైల్వేమార్గానికి శంకుస్థాపన చేసి నేటికి 30 ఏళ్లు పూర్తయ్యాయి. 178 కిలోమీటర్ల దూరమున్న ఈ మార్గానికి పెద్దగా నిధులు కేటాయించకపోవడంతో పనులు నెమ్మదిగా సాగి 24ఏళ్లకు పూర్తయ్యింది. ముందుగా పనులు ప్రారంభించిన ఎనిమిదేళ్లకు కరీంనగర్ వరకు (35 కిలోమీటర్లు) 2001లో లైన్ అందుబాటులోకి వచ్చింది. తరువాత జగిత్యాల వరకు లైన్ కోసం ఆరేళ్లు పట్టింది. 2016 డిసెంబరు 19న జగిత్యాల (లింగంపేట) వరకు రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2015లో లింగంపేట–మోర్తాడ్–నిజామాబాద్ వరకు రైల్వే మార్గాన్ని సిద్ధం చేశారు. తొలుత డీజిల్ ఇంజిన్ల రైళ్ల ప్రయాణం సాగించిన ఈ మార్గం .. ప్రస్తుతం పూర్తిస్థాయిలో విద్యుదీకరణ చేశారు. 2017లో విద్యుదీకరణ జరిగినా.. నేటికీ సింగిల్ బ్రాడ్‌గేజ్ లైన్‌గానే మిగిలిపోయింది.

పాతవే తప్ప.. కొత్త రైళ్లేవీ..

ఇన్నేళ్ల రైల్వేలైన్ చరిత్రలో ఇక్కడ నుంచి చెప్పుకోదగ్గ రైళ్లేవీ ఇక్కడ నుంచి నడవలేదంటే అతిశయోక్తి కాదు. వీక్లీ స్పెషల్‌గా కాజీపేట నుంచి దాదార్ ఎక్స్‌ప్రెస్, నిజామాబాద్ నుంచి సిర్పూర్ టౌన్ మెము పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ నుంచి కరీంనగర్ డెము ఎక్స్‌ప్రెస్ పుష్‌పుల్, కరీంనగర్ నుంచి తిరుపతి బైవీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఈ మార్గాల నుంచి సరుకు రవాణా ద్వారా దక్షిణ మధ్య రైల్వేకు అధిక ఆదాయం వస్తోంది. ఈ మార్గంలో ఉమ్మడి జిల్లా నుంచి గ్రానైట్, బొగ్గు, వ్యవసాయ ఉత్పత్తులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతూనే ఉన్నాయి. గూడ్స్ రైళ్ల రద్దీ పెరగడంతో ఈ మార్గాన్ని రెండు వరుసలుగా విస్తరించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. దీనికి స్థానిక ఎంపీలు చొరవచూపి వచ్చే వర్షాకాల బడ్జెట్ సమావేశాల్లో డబుల్ మార్గంగా అప్‌గ్రేడ్ అయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భవిష్యత్తులో కరీంనగర్ కీలక జంక్షన్

కరీంనగర్ రైల్వేపరంగా వ్యూహాత్మక ప్రాంతం. కొత్తపల్లి మనోహరాబాద్ హైదరాబాద్ డివిజన్‌లోకి వస్తుంది. అదే పెద్దపల్లి – నిజామాబాద్ రైల్వేలైన్ సికింద్రాబాద్ డివిజన్. ఈ రెంటినీ కలిపి ఉత్తర భారతానికి వెళ్లే రైళ్లకు కరీంనగర్ కేంద్రంగా మారనుంది. కొత్తపల్లి– మనోహరాబాద్ (151కి.మీ)తోపాటు, ఆర్మూర్– ఆదిలాబాద్ (128 కి.మీ) పూర్తయితే ఉత్తర-దక్షిణ తెలంగాణలకు కరీంనగర్ కేంద్రంగా నిలవనుంది. కరీంనగర్– హసన్‌పర్తి రైల్వేలైన్ పూర్తయితే మహారాష్ట్ర, గుజరాత్ మరింత దగ్గరవనున్నాయి.

అలా జరగాల్సి ఉండే..!

- మొదటగా పెద్దపల్లి నుంచి నిజామాబాద్ రైల్వేమార్గాన్ని హైదరాబాద్ సంస్థానంలోని చివరి రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1948లో పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మీదుగా నిర్మించాలని అనుకున్నారు. అయితే ఆయన సంస్థానం భారత్‌లో విలీనం కావడంతో ప్రతిపాదన అటకెక్కింది.
- ప్రధానిగా పీవీ బాధ్యతలు చేపట్టాక తాను పెరిగిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి రైల్వేస్టేషన్ లేకపోవడంతో ఈ మార్గాన్ని వయా కరీంనగర్ మీదుగా నిర్మించాలని నిర్ణయించారు. శంకుస్థాపన సమయంలో ప్రస్తుత పెద్దపల్లి జిల్లాలోని మంథని నుంచి కొత్తగూడెం జిల్లా మణుగూరు వరకు విస్తరించాలని అనుకున్నారు. అయితే భారీగా అటవీ ప్రాంతం ఉండడం.. నక్సలైట్ల ప్రభావం.. గోదావరి నదిపై వంతెనల నిర్మాణం వంటివి అడ్డురావడంతో అనుమతి రాలేదు.

ప్రజల డిమాండ్లివే..

- కాజీపేట నుంచి నిజామాబాద్ వరకు పుష్‌పుల్ మెము ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులోకి తెస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ఉపయోగం.
- కరీంనగర్ నుంచి సికింద్రాబాద్ (వయా పెద్దపల్లి–కాజీపేట) మీదుగా మెము ఎక్స్‌ప్రెస్ నడపాలని గతంలో ప్రతిపాదనలు చేసినా అమలుకు నోచుకోవడం లేదు
- 07195/96 కాజీపేట నుంచి దాదార్ ముంబయి వీక్లీ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలుని రోజు నడపాలని ప్రజా ప్రతినిధులు కోరినా స్పందన లేదు

బీజేపీ చేసిందేమీ లేదు



రైల్వేలైన్ శంకుస్థాపన నుంచి రైళ్ల కేటాయింపు వరకు కాంగ్రెస్ ప్రభుత్వం చూపిన చొరవ ఎవరూ కాదనలేనిది. ప్రస్తుతం తిరుపతి బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను కనీసం రెగ్యులర్‌గా మార్చలేకపోతున్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు కనీసం ఉప్పల్ బ్రిడ్జి మీద లింక్ కలపడం లేదు.

– పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ, కాంగ్రెస్

పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం



కరీంనగర్–హసన్‌పర్తి రైల్వేలైన్‌కు ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇప్పించాం. ఇందుకోసం రూ.1.54 కోట్లు విడుదల చేయించాం. తీగలగుట్టపల్లి ఆర్వోబీకి సేతుబంధన్ పథకం కింద రూ.126 కోట్లు విడుదల చేయించాం. తిరుపతి రైలును రెగ్యులర్‌గా మార్చే విషయాన్ని పార్లమెంట్‌లో ప్రస్తావిస్తాం.

– బండి సంజయ్, ఎంపీ, బీజేపీ

రైల్వే రంగానికి పెద్దపీట



కరీంనగర్ ప్రజలకు రైల్వే సదుపాయం అందించేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తోంది. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ పనులే ఇందుకు నిదర్శనం. తీగలగుట్టపల్లి ఆర్వోబీకి అనుమతులు తేవడంలోనూ మా పోరాటం ఉంది. తిరుపతి రైలును రెగ్యులర్ చేయాలనే డిమాండ్‌పై కేంద్రం దృష్టి సారించాలి.

– వినోద్‌కుమార్, మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఉమ్మడి జిల్లాకు కేంద్రం నిధులు

- క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ కింద రూ.250 కోట్ల సాయం
- నిధులను మౌలిక సదుపాయాలకు వినియోగం



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లాకు కేంద్రం నిధులు మంజూరయ్యాయి. స్కీం ఆఫ్ స్పెషల్ అసిస్టెన్స్ టూ ద స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ 2023–24 కింద ఈ నిధులు రానున్నాయి. ఈ పథకం కింద రాష్ట్రానికి మొత్తంగా రూ.2102 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో ఉమ్మడి జిల్లాకు రూ.250.5 కోట్ల సాయం అందనుంది. వీటిని మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా వివిధ శాఖల పరిధిలో ఉన్న భవనాలు, కాలేజీలు, గిడ్డంగులతోపాటు రోడ్లు, రైల్వే నెట్‌వర్క్ నిర్మాణానికి వినియోగించనున్నారు.

ఏ జిల్లాకు ఎలా..?

- కరీంనగర్‌లోని మొదటి సంవత్సరం విద్యార్థులకు వసతి కల్పించేందుకు విత్తన గిడ్డంగిని ఆధునీకరించేందుకు రూ.11 కోట్లు ఇవ్వనున్నారు.
- కరీంనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు రూ.100 కోట్లు రానున్నాయి.
- కొత్తపల్లి –మనోహరాబాద్ రైల్వేలైన్ కోసం మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో వినియోగించుకునేందుకు రూ.100 కోట్లు వెచ్చించనున్నారు.
- ముస్తాబాద్ – రాళ్లపేట వయా పోతుగల్, గన్నేరువరం, సేవాలాల్ తండా, ఓబులాపూర్ రహదారి బలోపేతం, విస్తరణకు రూ.27.50 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- అంబర్‌పేట – చెగ్యాం వయా పైడిపల్లి, తాళ్లకొత్తపేట (వెల్గటూరు మండలం) ఎస్‌హెచ్–7 రహదారి విస్తరణకు రూ.12 కోట్లు వ్యయం చేయనున్నారు.

అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలి

- కలెక్టర్ యాస్మిన్‌బాషా



కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: అభ్యర్థులు గ్రూప్–4 పరీక్షలకు సకాలంలో హాజరు కావాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. జూలై 1న ఉదయం 8 నుంచి 9.45 వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2.15 గంటల వరకు పరీక్ష సెంటర్‌లోకి అభ్యర్థులను అనుమతించడం జరుగుతుందన్నారు. తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతి ఉండదని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు తీసుకురావద్దని, అభ్యర్థులు చెప్పులు మా త్రమే వేసుకుని రావాలని, మహిళలు ఆభరణాలు ధ రించి రావద్దన్నారు. ఒరిజినల్ హాల్‌టికెట్‌తో పాటు, వ్యాలిడిటీ ఫొటో, గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. జిల్లాలో 73 పరీక్ష కేంద్రాల్లో 21,937 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. హాల్ టికెట్‌పై ఫొటో సరిగా లేకుంటే గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించుకోవాలన్నారు. పరీక్ష పత్రంలో ఏమైనా ప్రింటింగ్ సరిగా లేకపోతే వెంటనే ఇన్విజిలేటర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. పరీక్ష హాల్‌లో ప్రతి అరగంటకోసారి బెల్ మోగించడం జరుగుతుందని, చివరి 5 నిమిషాలు సూచిస్తూ హెచ్చరిక బెల్ మోగుతుందని, దీనికి అనుగుణంగా పరీక్ష రాయాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు.





భక్తిశ్రద్ధలతో బక్రీద్

జగిత్యాలటౌన్: త్యాగానికి ప్రతీకగా భావించే బక్రీద్ పర్వదినాన్ని గురువారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లాలో జరిగిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. మత గురువులు బక్రీద్ విశిష్టతను వివరించారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వేడుకల్లో పాల్గొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ సందర్భంగా ఖిల్లా వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైతులకు న్యాయం చేయండి

- సివిల్ సప్లై కమిషనర్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ



రైతులతో కలిసి లేఖను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ధాన్యం సేకరణలో నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా వ్యవసాయాధికారుల సర్టిఫికేషన్ మేరకు ధాన్యం మిల్లులకు తరలించే సమయంలో 40కేజీల బస్తాకు 2కేజీల కోత విధించారని, రైతులను దోపిడీకి గురిచేస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఈమేరకు గురువారం పౌరసరఫరాల కమిషనర్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, వరి ధాన్యం సేకరణలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామన్న సీఎం హామీ అమలు కాకపోవడం బాధాకరమన్నారు. కొనుగోలు కేంద్రాల్లోని కాంటాలు, ధర్మకాంటా, ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జి తూకంలో జరుగుతున్న మోసాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు. సేకరణ సమయంలో జరిగిన కోతలకు తోడు డబ్బు చెల్లింపులోనూ కోతలు విధిస్తున్నారని చల్‌గల్ గ్రామ రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ధాన్యం సేకరణలో జరుగుతున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

దుప్పి అప్పగింత



దుప్పిని అప్పగిస్తున్న గ్రామస్తులు

రాయికల్(జగిత్యాల): దుప్పిపిల్ల దారితప్పి జనావాసాల్లోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని మూటపల్లి గ్రామంలో తోట రాజిరెడ్డి ఇంటి వద్దకు గురువారం దుప్పి పిల్ల రాగా గ్రామస్తులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దుప్పి పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు సర్పంచ్ బెక్కం తిరుపతి తెలిపారు.

ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: జిల్లాలో ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈవో, డీఈవో పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుదారు. జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, బుక్స్ కొనాలని తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సాయికుమార్, నందు, శ్రీను, సునీల్, శ్రావణ్ పాల్గొన్నారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన తిప్పర్తి రమాదేవిపై కత్తితో దాడిచేసిన ఆమె అల్లుడు తుమ్మనపల్లి శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తెలిపారు. వివరాలు.. రమాదేవి కూతురు శ్రీజను 10 సంవత్సరాల క్రితం సాయిరాంనగర్‌కు చెందిన తుమ్మనపల్లి శ్రీధర్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు పిల్లలు. కొద్దికాలంగా శ్రీధర్ మద్యం తాగి వచ్చి శ్రీజను కొట్టడంతో పాటు హింసించాడు. దీంతో శ్రీజ ఆర్మూర్‌లో నివాసం ఉంటుండగా, ఐదు రోజుల క్రితం శ్రీధర్ అక్కడకు వెళ్లి ఆమెపై దాడిచేయగా ఆర్మూర్‌లో శ్రీధర్‌పై కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం శ్రీజ పుట్టింటికి వచ్చింది. గురువారం మధ్యాహ్నం శ్రీధర్ వారింటికి వెళ్లి శ్రీజపై కత్తితో దాడిచేసేందుకు ప్రయత్నించగా అత్త రమాదేవి అడ్డుకోవడంతో ఆమె చేతికి గాయాలయ్యాయి. రమాదేవి ఫిర్యాదు మేరకు శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

మల్లాపూర్(కోరుట్ల): మంచానికే పరిమితమైన వృద్ధుడు మనస్తాపంతో గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని మొగిలిపేటకు చెందిన మల్యాల నర్సయ్య(65) 20 రోజుల క్రితం సైకిల్‌పై నుంచి కిందపడడంతో నడుము భాగంలో ఎముక విరిగింది. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంచానికే పరిమతమై నొప్పితో బాధపడుతూ సొంత ప నులు కూడా చేసుకోలేక మానసికంగా కృంగి పోయి జీవితంపై విరక్తిచెందాడు. భార్య బుచ్చి రాజు కుమారుడి వద్ద వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మరో నగ

- నాడు గీట్ల కృషితో వ్యవసాయ పరిశోధన కేంద్రం
- నేడు దాసరి కృషితో వ్యవసాయ కళాశాల
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండోది
- కూనారంలో కళాశాల ఏర్పాటుకు సీఎం అంగీకారం
- నాయకుల్లో ఉత్సాహం.. రైతుల్లో ఆనందం



కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం



వ్యవసాయ కళాశాల కోసం మంత్రి నిరంజన్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మరో వ్యవసాయ కళాశాల ఏర్పాటు కానుంది. జగిత్యాల జిల్లా పొలాసలో వ్యవసాయ కళాశాల ఉండగా పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారంలో రెండో వ్యవసాయ కళాశాలకు సీఎం కేసీఆర్ అంగీకారం తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని కలిసి, కూనారంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీనికి మంత్రితోపాటు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. రైతు బిడ్డ, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దివంగత గీట్ల ముకుంద రెడ్డి చొరవతో కూనారంలో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి రఘువీరారెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. నేడు అదే గ్రామంలో వ్యవసాయ కళాశాల కోసం ప్రస్తుత ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి కృషితో నియోజకవర్గ ప్రజలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హైబ్రిడ్ వరి వంగడాలు

కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రంలో శాస్త్రవేత్తలు తయారు చేసిన హైబ్రిడ్ నూతన వరి వంగడాలు కూనారం సన్నాలు కేఎన్ఎం–118, కేఎన్ఎం–1638 అధిక దిగుబడితోపాటు తెగుళ్లను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయి. ఇవి మన రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాల్లో ప్రత్యేకత సంతరించుకున్నాయి. అలాగే కళాశాల ఏర్పాటైతే ఎందరో విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ప్రయోజనం..



కూనారంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంత రైతులకు, వారి బిడ్డలకు ప్రయోజనం కలుగుతుంది. కళాశాల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి రైతుల పక్షాన కృతజ్ఞతలు.

– వంగళ తిరుపతి రెడ్డి, జెడ్పీటీసీ, కాల్వశ్రీరాంపూర్

ఇక్కడి ప్రజల అదృష్టం



గీట్ల ముకుంద రెడ్డి కూనారంలో వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయిస్తే, దాసరి మనోహర్ రెడ్డి వ్యవసాయ కళాశాల మంజూరు చేయించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం. వారికి రుణపడి ఉంటాం.

– నూనేటి సంపత్‌యాదవ్, ఎంపీపీ, కాల్వశ్రీరాంపూర్

అన్నదాతలు బాగుండాలి



అన్నదాతలు బాగుంటునే దేశం బాగుంటుంది. రాష్ట్ర ప్రభుత్వం వారికి కాళేశ్వరం ప్రాజెక్టు జలాలు అందిస్తోంది. విత్తనాలు, ఎరువుల కొరత లేకుండా చూస్తోంది. వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు నావంతు కృషి చేశా.

– ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, పెద్దపల్లి

గ్రూప్–4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: జిల్లా వ్యాప్తంగా జూలై 1న నిర్వహించే గ్రూప్–4 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మొత్తం 73 కేంద్రాల వద్ద ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, చుట్టుపక్కల లౌడ్‌స్పీకర్లు మూసివేయాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడవద్దన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికంటే 2 గంటల ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలన్నారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రాలు

జిల్లాలో మొత్తం 73 పరీక్ష కేంద్రాలు ఉండగా, జిల్లా కేంద్రంలో 27, జగిత్యాల రూరల్‌లో 7, మెట్‌పల్లిలో 11, కోరుట్ల 20, రాయికల్ 4, మల్యాల 2, కొడిమ్యాల 1, గొల్లపల్లి 1 పరీక్ష కేంద్రాలున్నాయని ఎస్పీ తెలిపారు. పేపర్–1 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, పేపర్–2 మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కేంద్రాలకు బ్యాగులు, సెల్‌ఫోన్లు, స్మార్ట్ ఫోన్లు, వాచ్‌లు, కాలుక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని, అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకోవాలని, షూలు వేసుకుని రావద్దన్నారు. అభ్యర్థులను మెటల్ డిటెక్టివ్ ద్వారా పరీక్షించి కేంద్రంలోకి పంపించడం జరుగుతుందన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- నగదు రికవరీ
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రంలోని షిమోగా జిల్లాలోని భద్రావతికి చెందిన శివుడు, అదే ఏరియాకు చెందిన కళ్యాణ్, సందీప్, సూరి కర్ణాటకతోపాటు వికారాబాద్, సిరిసిల్లలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్‌కు చెందిన క్లెం శ్రీనివాస్ బోర్‌వెల్ దుకాణం నడిపేవాడు. జూన్ 3న తన గ్రామం నుంచి కారులో వేములవాడకు వచ్చి బొమ్మల స్వామి నుంచి తీసుకున్న రూ.5లక్షల చెక్కును బ్యాంకులో వేసి డబ్బులు తీసుకున్నారు. ఆ నగదును కారు వెనుక సీటులో పెట్టుకొని వేములవాడలోని ఆర్ అండ్‌ఆర్ కాలనీలో తన సోదరి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులకొట్టి ఆ సొమ్మును ఎత్తుకెళ్లారు. దీనిపై వేములవాడ టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డీఎస్పీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో వేములవాడ సీఐ వెంకటేశ్, సీసీఎస్ ఎస్సై మారుతి ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు దొంగతనాలకు పాల్పడిన వారు కర్ణాటకకు చెందిన వారిగా తెలుసుకుని అక్కడికెళ్లి శివను అదుపులోకి తీసుకుని రూ.5 లక్షలు రికవరీ చేశారు. వేములవాడలో దొంగతనాలు చేసిన రూ.2.60 లక్షలు, అలాగే వేములవాడలో మే నెలలో దొంగతనం చేసిన రూ.40 వేలను రికవరీ చేశారు. బల్లారి, రాయచోరీలతోపాటు హుజూర్‌నగర్, సూర్యపేట, తాండూర్, వికారాబాద్‌లలో పలు దొంగతనాలు చేసినట్లు తెలిపారు. పరారీలో ఉన్న దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ వెంకటేశ్, సీసీఎస్ కానిస్టేబుల్ అక్షర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

మంథని: ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బోనగాని శంకరయ్య అనే గీత కార్మికుడు గురువారం కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని వెన్ను, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి, ముత్తారంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు.

మొక్కజొన్న సబ్సిడీకి మంగళం

- ఓపెన్ మార్కెట్‌లోనే హైబ్రిడ్ విత్తనాల కొనుగోలు
- కంపెనీలను బట్టి 4 కిలోల బస్తాకు రూ.1,000–1,800



హైబ్రిడ్ విత్తనాలను ఉత్పత్తి చేసే ఆడ, మగ మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వానాకాలం సీజన్‌లో అత్యధికంగా సాగు చేసే మొక్కజొన్న విత్తనాలకు ప్రభుత్వం మంగళం పాడింది. వరి విత్తనాల మాదిరిగా రైతులు తమ పంట నుంచి వచ్చే మొక్కజొన్న విత్తనాలు వాడుకుంటే దిగుబడులు రావు. దీంతో మొక్కజొన్న సాగు చేసే రైతులు ప్రైవేట్ కంపెనీలు ఉత్పత్తి చేసే హైబ్రిడ్ విత్తనాలపైనే ఆధారపడుతున్నారు. దీంతో ఆయా కంపెనీలు చెప్పిన ధరకు రైతులు ఓపెన్‌మార్కెట్లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతులపై మరింత భారం పడుతోంది.

వైఎస్ హయాంలో 33 శాతం రాయితీ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ప్రైవేట్ కంపెనీలకు చెందిన మొక్కజొన్న విత్తనాలపై 33 శాతం సబ్సిడీ ఇచ్చేవారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మొక్కజొన్న విత్తనాలకు సబ్సిడీ రద్దు చేశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు 60 వేల ఎకరాల్లో మక్క సాగు చేస్తారు. రైతులు ఎకరానికి 4 కిలోల విత్తనాలు వాడుతారు. దీన్ని బట్టి జిల్లాకు 2.40 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం.

కంపెనీల ఇష్టారాజ్యం

రైతుల డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని ప్రైవేట్ కంపెనీలు తమకు నచ్చిన ధరకు అమ్ముతున్నాయి. ప్రభుత్వ ఆజమాయిషి లేకపోవడంతో కంపెనీలు తమ ఉత్పత్తి ధర, లాభాలు చేసుకుంటూ అమ్మకాలు సాగిస్తున్నాయి. రైతులు క్వింటాల్ మక్కలను రూ.1,800–2,000 విక్రయిస్తే, కంపెనీలు మాత్రం డిమాండ్‌ను బట్టి 4 కిలోల బస్తాను రూ.1,000–1,800 వరకు విక్రయిస్తున్నాయి. తమ విత్తనాలు సాగు చేస్తే ఎకరానికి 30–40 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, మొక్కజొన్న ఆకులు ఎక్కువగా రావడంతో రామచిలుకలు రావని, పంటకు తెగుళ్లు ఆశించవంటూ కంపెనీలు గ్రామాల్లో ప్రచారం చేస్తూ రైతులకు ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి.

సబ్సిడీ రాక జిల్లా రైతులకు రూ 3 కోట్ల నష్టం

మక్క విత్తనాలపై సబ్సిడీ లేకపోవడంతో జిల్లా రైతులకు రూ.3 కోట్ల వరకు నష్టం వాటిల్లితుంది. సగటున మొక్కజొన్న 4 కిలోల విత్తన సంచిని రూ.1,500 కంపెనీలు విక్రయిస్తే, ఆ సంచిపై 33 శాతం రాయితీ ఉంటే రైతులకు రూ.495 సబ్సిడీ దక్కేది. కేవలం రైతులు సంచికి రూ.1,005 చెల్లిస్తే సరిపోయేది. సబ్సిడీ ఎత్తివేయడంతో జిల్లా రైతులపై దాదాపు రూ.3 కోట్ల వరకు అదనపు భారం పడుతుంది. ఎలాగంటే, జిల్లాలోని 60 వేల ఎకరాలకు, ఎకరానికి ఒక బస్తా వాడినా 60 వేల బస్తాల విత్తనాలు అవసరం. బస్తాపై ఇచ్చే రూ.495 సబ్సిడీ రాకపోవడంతో జిల్లా రైతులు పూర్తిస్థాయి ధర పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

సబ్సిడీ ఇవ్వాలి



మొక్కజొన్న విత్తనాలకు కనీసం 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి. దీంతో రైతులకు కొంత మేలు జరుగుతుంది. నేను ఐదెకరాల్లో మక్క సాగు చేస్తే విత్తనాల ఖర్చే రూ.6 వేల నుంచి రూ.8 వేలు అవుతుంది. సబ్సిడీ ఇస్తే నాలాంటి రైతులకు కొంత ఖర్చు తగ్గుతుంది.

– సత్యనారాయణరెడ్డి, రైతు, సారంగాపూర్

రాయితీ లేదు



ప్రస్తుతం మక్క విత్తనాలపై ఎలాంటి సబ్సిడీ లేదు. ప్రభుత్వం తరుపున విత్తనాలు అందించడం లేదు. ప్రైవేట్ కంపెనీలు ఓపెన్ మార్కెట్లో విత్తనాలు అమ్ముకుంటున్నాయి. నమ్మకం, నాణ్యమైన సంస్థ నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచిస్తున్నాం.

– సురేశ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

అమ్మో.. సర్పానికి వైద్యం



చికిత్స చేస్తున్న పశువైద్యులు

కరీంనగర్ అర్బన్: పామంటే శరీరంలో ఒకరకమైన జలదరింపు. కానీ పామును పట్టుకుని చికిత్స చేయడమంటే సాహసమే కదా. అదే ఘటన కరీంనగర్ జిల్లా పశువైద్యశాలలో చోటు చేసుకుంది. గాయపడిన పాముకు రెండుసార్లు పశువైద్యులు చికిత్స చేసి బాగుచేయడం గమనార్హం. వివరాల్లోకి వెళితే ఈ నెల 27న నగరంలోని టవర్ సర్కిల్ ప్రాంతంలోని దుకాణంలో జెరిపోతు హల్‌చల్ సృష్టించగా చంపేందుకు ప్రయత్నించగా పలు చోట్ల దెబ్బలు తగిలినా తప్పించుకుంది. దీంతో దుకాణ యజమాని స్నేక్ క్యాచర్ సుమన్‌కు సమాచారమివ్వడంతో పట్టుకుని జిల్లా పశువైద్యశాలకు తరలించారు. రెండు రోజుల క్రితమే చికిత్స చేయగా దానిని వైద్యుల పర్యవేక్షణలో ఉంచి పాలలో యాంటిబయటిక్ పౌడర్ కలిపి తాగించి గురువారం సీనియర్ పశువైద్యులు డా.తుమ్మల కిరణ్‌కుమార్‌రెడ్డి మళ్లీ చికిత్స చేశారు. ఆరోగ్యం బాగుపడటంతో శివారు ప్రాంతంలో వదిలేశారు.

సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులు అందిస్తున్న బాపురెడ్డి, నాయకులు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలం ఊటిపెల్లి, భూషణరావుపేట గ్రామాలకు చెందిన నలుగురికి సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి గురువారం పంపిణీ చేశారు. ఊటిపెల్లికి ఒగులవేని నిఖిల్‌కు రూ.43,500, చెన్నవేని శారద రూ.25,000, భూషణరావుపేటకు చెందిన పుల్ల కిశోర్‌కు రూ.27,500, ఏలేటి చిన్నసాయభ్‌కు రూ.60,000 విలువగల చెక్కులను అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, పుర్కుటపు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ఆస్పత్రులు



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల: జగిత్యాల జిల్లా కేంద్రంగా ఏర్పడటంతో కార్పొరేట్‌కు దీటుగా ఆస్పత్రులు వెలుస్తున్నాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాలలోని బైపాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన శ్రీమేధా న్యూరాలజీ అండ్ కిడ్నీ ఆస్పత్రిని గురువారం ప్రారంభించి మాట్లాడారు. గతంలో అనారోగ్యానికి గురైతే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం జగిత్యాలలో అన్ని వసతులతో ఆస్పత్రులు ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి విభాగానికి చెందిన ఆస్పత్రులు జగిత్యాలలో వెలిశాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ దత్త ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెమెరా దినోత్సవం



ధర్మపురి: జాతీయ ఫొటో కెమెరా దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ధర్మపురి మండల ఫొటో, వీడియో కెమెరా సంఘం ఆధ్వర్యంలో స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో వేడుకలు జరిపారు. ఈసందర్భంగా కెమెరాను అమ్మవారిగా అలంకరించి పంచమృతాలతో అభిషేకం చేశారు. సాధారణ పూజలతో పాటు కెమెరా పరిభాషలో అంగపూజ, అర్చన, ధూపదీప నైవేద్యం, మంగళహారతి, పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫొటో కెమెరా సంఘం నాయకులు తదితరులున్నారు.

గోవధతో ధర్మపురిలో ఉద్రిక్తత



నాయకులకు నచ్చచెబుతున్న డీఎస్పీ ప్రకాశ్

ధర్మపురి: గోవధను అడ్డుకోవడంతో జగిత్యాల జిల్లా ధర్మపురిలో ఉద్రిక్తత నెలకొంది. ధర్మపురి పట్టణంలోని మారుమూల ప్రాంతంలో గురువారం బక్రీద్ సందర్భంగా ఓ వర్గం వారు గోవధ చేస్తున్నారనే సమాచారంతో విశ్వహింద్ పరిషత్ నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని అడ్డుకోవడం ఇరువర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వెంటనే జగిత్యాల డీఎస్పీ ప్రకాశ్ ఆధ్వర్యంలో మల్యాల సీఐ కోటేశ్వర్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన ఎస్సైలు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గోవధ చట్టరీత్యా నేరమంటూ వీహెచ్‌పీ నాయకులు వాగ్వాదానికి దిగారు. గోవధ చేసింది ఆవులనా..? లేక ఎడ్లనా..? అనే విషయంపై పశు వైద్యాధికారి రాజేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించారు. ఎడ్లనే వధించారని వైద్యులు నిర్ధారించారు. అనుమతి లేకుండా గోవధ చేయరాదని, ఎడ్లు ఆరోగ్యంగా ఉన్నాయా లేదా పోస్టుమార్టం రిపోర్టులో వచ్చిన ఆధారంగా చర్యలుంటాయని పోలీసులు తెలిపారు.

జాతీయ రహదారిపై బైఠాయింపు

ధర్మపురిలో గోవధ చేయడంపై వీహెచ్‌పీ నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా డీఎస్పీ ప్రకాశ్, నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. గోవధ చేశారని ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని, ఎవరైనా అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని డీఎస్పీ హెచ్చరించారు. సుమారు 2గంటల పాటు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

నేడు ధర్మపురికి బంద్‌కు పిలుపు

ధర్మపురిలో గోవధ ఘటనను నిరసిస్తూ శుక్రవారం హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్‌కు పిలుపునిచ్చారు. గోవధ నిషేధంపై వర్తక వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు

చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని అల్లర్లకు పాల్పడిగే కఠిన చర్యలుంటాయని డీఎస్పీ ప్రకాశ్ హెచ్చరించారు. ధర్మపురిలో గోవధ ఘటనపై గురువారం పోలీస్ స్టేషన్లో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. బక్రీద్ సందర్భంగా ఓ వర్గం వారు గోవధ చేయగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అడ్డుకోవడం జరిగిందని దీంతో పట్టణంలో ఉద్రిక్తత నెలకొందని తెలిపారు. పశు వైద్యాధికారుల అనుమ తి లేకుండా పట్టణంలోని సయ్యద్ యూసుఫ్, ఎండీ ఇస్మాయిల్ ఇటుకబట్టీల వద్ద నాలుగు ఎడ్లను వధించిన విషయం యదార్థమని, శానిటరి ఇన్‌స్పెక్టర్ గంగాధర్ ఫిర్యాదు మేరకు బాధ్యులైనా ఎండీ మజీర్, శేఖర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు. సోషల్ మీడియాలో ఆవులను వధించారని అసత్య ప్రచారాలను మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో సీఐ రమణమూర్తి, ఎస్సై దత్తాత్రి ఉన్నారు.